క్లుప్తంగా

జెడ్పీ కార్యాలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



జెడ్పీ కార్యాలయంలో ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్ కార్యాలయంలో రూ.90.50 లక్షలతో చేపట్టిన ఆధునికీకరణ పనులకు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ కార్యాలయ సిబ్బందికి పని చేసే ప్రదేశంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు కార్యాలయంలోని పలు విభాగాలను ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు జెడ్పీటీసీ కొయ్యే సూర్యారావు, జిల్లా ప్రజాపరిషత్ ముఖ్యకార్య నిర్వహణాధికారి కేఎస్ఎస్ సుబ్బారావు, డిప్యూటీ సీఈవో ఎస్.నిర్మలజ్యోతి, పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీర్ కేదారేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణమూర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్, జి.శ్రీధర్‌రాజు, సీహెచ్ గోపాలకృష్ణ, ఏవో, సెక్షన్ సూపరింటెండెంట్లు, జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంప్రదాయం ప్రతిబింబించాలి



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సంక్రాంతి పండుగ వేళ ప్రతి ఇంటా సంప్రదాయం ప్రతిబింబించాలని స్థానిక 1,2 డివిజన్ల వైఎస్సార్ సీపీ నాయకుడు అక్కిశెట్టి పూర్ణచంద్రరావు (చందు) అన్నారు. అక్కిశెట్టి పూర్ణ చంద్రరావు సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక 1,2 డివిజన్ల మహిళలకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలో 1,2 డివిజన్లలోని రామానగర్, నల్లదిబ్బ, కొమడవోలు, ఆండాళ్ళమ్మ తోట, మారుతీ నగర్, నవాబు పేట, సత్యనారాయణ పేట, పాండురంగపురం, బావిశెట్టివారి పేట ప్రాంతాల నుంచి మహిళలు, యువతులు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ స్థానిక పెద్దల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తేలప్రోలు నాగమణి, కే. త్రివేణి, నాలి ఈశ్వరమ్మ, చాట్ల దుర్గ, పాలకొండ జ్యోతి, బూసి ధనలక్ష్మి, గండేటి రంగా, కర్రి రాజేష్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఓటు హక్కు



కలెక్టరేట్‌లోని విభిన్న ప్రతిభావంతుల కార్యాలయంలో మాట్లాడుతున్న ఏడీ

ఏలూరు (టూటౌన్): ఈ ఏడాది నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధులందరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏడీ పి.రాకడ మణి కోరారు. జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియజేసారు. ఇతర సమాచారం కోసం 1950 టోల్ ఫ్రీ నంబరును సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో విభిన్న ప్రతిభావంతులకు చెందిన పలు సంఘాల నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఓ వ్యక్తికి రిమాండ్

భీమడోలు: పూళ్ల గ్రామానికి చెందిన వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడ్ని శుక్రవారం భీమడోలు పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పూళ్ల గ్రామానికి చెందిన సిద్దాబత్తుల విఘ్నేశ్వరరావు కుటుంబానికి, అదే గ్రామానికి చెందిన నూతులపాటి పొలు కుటుంబానికి మధ్య గొడవలున్నాయి. ఆ నేపథ్యంలో గతంలో విఘ్నేశ్వరరావు అన్నయ్య శంకరం మృతి చెందాడు. ఈ కేసు కోర్టులో నడుస్తోంది. తన అన్నయ్య శంకరం మృతికి కారణమైన పొలుపై విఘ్నేశ్వరరావు పగ పెంచుకున్నాడు. పూళ్ల బ్రాందీ షాపు వద్ద మద్యం మత్తులో బుధవారం రాత్రి విఘ్నేశ్వరరావు, పొలు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీనితో ఆగ్రహించిన విఘ్నేశ్వరరావు తన వద్ద ఉన్న బీరు సీసాతో పొలు తలపై కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలైన పొలును ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. క్షతగాత్రుడు పొలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విఘ్నేశ్వరరావుపై కేసు నమోదు చేసి భీమడోలు కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగు నింపాలి

- జెడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- ఏలూరులో పండుగ శోభ
- నగరపాలక సంస్థ, జెడ్పీ కార్యాలయ ప్రాంగణాల్లో సందడి



ఏలూరు జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో పిండి వంటలను రుచి చూస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ప్రసాద్ తదితరులు



భోగి మంట వద్ద కోలాటం ఆడుతున్న మేయర్ నూర్జహాన్, పెదబాబు, కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు(మెట్రో): సంక్రాంతి అందరి జీవితాల్లో వెలుగు నింపాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. శుక్రవారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్. సుబ్బారావు అధికారులు, కార్యాలయ సిబ్బందితో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిబ్బంది ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలు, భోగి మంటలు, భోగి పండ్లు, గంగిరెద్దు, హరిదాసు, సంక్రాంతి పిండి వంటలు, తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా వస్త్రధారణ, బాలల నృత్య రూపకాలను జెడ్పీ ఛైర్ పర్సన్ పద్మశ్రీ, ప్రసాద్ దంపతులు తిలకించారు. ముగ్గుల పోటీ, సంక్రాంతి వంటకాల తయారీలో గెలుపొందిన వారికి ఛైర్‌పర్సన్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. జెడ్పీ సీఈవో కేఎస్ఎస్ సుబ్బారావు, సీఈవో ఎస్.నిర్మలజ్యోతి, పంచాయతీరాజ్ ఎస్ఈ కె.కేదారీశ్వరరావు, జి.శ్రీధర్‌రాజు, సీహెచ్ గోపాలకృష్ణ, ఏవో, సెక్షన్ సూపరిటెండెంట్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రామచంద్రలో సంక్రాంతి సంబరాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, మెహెందీ, రంగోలీ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో భోగి మంటలు వేసి చిన్నారులకు భోగిపండ్ల వేడుక నిర్వహించారు. సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్న విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎండీ కే. సాయిరోహిత్, ప్రిన్స్‌పాల్ కే. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో సంక్రాంతి సంబరాలు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కార్పొరేషన్ కార్యాలయంలో సంక్రాంతి వేడుకలు భారీఎత్తున ఏర్పాటు చేయటంతో కళకళలాడుతూ కాంతులీనింది. ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు పెదబాబు దంపతులు సంక్రాంతి వేడుకల్లో హాజరై సిబ్బందితో ఉత్సాహంగా గడిపారు. నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, అధికారులు, కార్పొరేటర్లు సంప్రదాయ వస్త్రధారణతో వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయం 8గంటల నుంచి సాగిన సంక్రాంతి వేడుకలు సంతోషాన్ని నింపాయి. సంక్రాంతి వేడుకల్లో గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసులు, బుడబుక్కల వాళ్ల వాయిద్యాలతో సందడి వాతావరణం నెలకొంది. మెప్మా సిబ్బంది పాయసం, అరిసెలు, సున్నుండలు, ఇతర పిండి వంటకాలు తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. నగరపాలక సిబ్బంది ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందర్నీ ఆకట్టుకుంది. ఇక ఆవరణ మంతా ఉద్యోగులు రంగవల్లులతో నింపి రంగులమయం చేశారు. తొలుత మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విష్ణుమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. భోగిమంటలు వెలిగించటంతోపాటు గొబ్బెమ్మలు, కోలాటాలతో ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ పండుగను సంతోషంగా నిర్వహించారు.



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న మేయర్



రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో ముగ్గులను తీర్చిదిద్దుతున్న విద్యార్థినులు

ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతిని నగర ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, ప్రతి ఇల్లు సిరి సంపదలతో, ఆనందాల హరివిల్లులా మారాలని ఆకాంక్షించారు. ఏలూరు నగర ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ మాట్లాడుతూ ఏలూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. సంక్రాంతి వేడుకల్లో అదనపు కమిషనర్ బాపిరాజు, డిప్యూటీ కమిషనర్ ఎస్.రాధ, కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, అన్నపనేని భారతి, సబ్బన శ్రీనివాస్, కలవకొల్లు సాంబ, మునగాల కేదారేశ్వరి, మెప్మా పీడీ ఇమ్మానియేల్, పీవో కృష్ణమూర్తి, సెక్రటరీ ప్రభుదాసు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, సీవోలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు



ఖోఖో క్రీడాకారిణిలను అభినందిస్తున్న తిరుమలరావు



విజయం సాధించిన అశోక్‌నగర్ క్రికెట్ జట్టు

ఏలూరు రూరల్: ఏలూరు నియోజకవర్గంలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఏలూరు ఇండోర్ స్టేడియంలో మహిళల కబడ్డీ పోటీలు ఆకట్టుకున్నాయి. హోరాహోరీగా సాగిన కబడ్డీ మ్యాచ్‌లో గొల్లాయిగూడెం జట్టుపై అరుంధతీపేట జట్టు విజయం సాధించింది. ఖోఖో మ్యాచ్‌లో దక్షిణపువీధి జట్టుపై రాజీవ్‌గాంధీ పార్కు జట్టు విజయం సాధించింది. క్రీడాకారిణిలను టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తిరుమలరావు అభినందించారు. మహిళల బ్యాడ్మింటన్ విభాగంలో రాజీవ్‌గాంధీ పార్క్ జట్టుపై గొల్లాయిగూడెం జట్టు విజయం సాధించింది. పురుషుల విభాగం క్రికెట్ పోటీలు ఇండర్ స్టేడియంలో నిర్వహించారు. క్రికెట్ మ్యాచ్‌లో దక్షిణపువీధి జట్టుపై అశోక్‌నగర్ జట్టు విజయం సాధించింది. రాజీవ్‌గాంధీ పార్క్ జట్టుపై తోటకూరదొడ్డి జట్టు గెలుపొందింది.

17న మ్యాచ్‌ల వివరాలు: సంక్రాంతి పండుగ సెలవుల కారణంగా ఈ నెల 17 నుంచి మళ్లీ ఆటల పోటీలు నిర్వహిస్తామని క్రీడాధికారులు వెల్లడించారు. దీనిలో భాగంగా 17న పురుషుల వాలీబాల్ విభాగంలో చేపలతూమ సెంటర్ జట్టు, గొల్లాయిగూడెం జట్టుతో తలపడుతుంది. కోటదిబ్బ జట్టుతో రాజీవ్‌గాంధీపార్క్ జట్టును ఢీ కొడుతుంది. మహిళల విభాగంలో శాంతినగర్ జట్టుతో పోస్టల్‌కాలనీ జట్టు తలపడుతుందని అధికారులు వెల్లడించారు. ఖోఖో మహిళల విభాగంలో దక్షిణపువీధి జట్టుతో అరుంధతి జట్టు, పురుషుల విభాగంలో పడమరవీధి జట్టుతో గొల్లాయిగూడెం జట్టు తలపడుతుందని నిర్వాహకులు వెల్లడించారు. గెలుపొందిన జట్టుతో తదుపరి మ్యాచ్‌లో రామచంద్రరావుపేట జట్టు, గొల్లాయిగూడెం జట్టు తలపడతాయని నిర్వాహకులు వెల్లడించారు. పోటీల నిర్వహణలో డీఎస్ఏ వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ రమేష్, పీఈటీలు ప్రతాప్, కె మురళీకృష్ణ, భోగలింగేశ్వరావు, మురళీకృష్ణ, ప్రసన్న, పి గోపీ, రమేష్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కుడారై ఉత్సవం



కుడారై ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోదాదేవికి కుడారై ఉత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాదేవికి విశేష ప్రసాద నివేదన చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించి అనంతరం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. సాయంత్రం నిర్వహించిన వివిధ సంగీత, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. నగరానికి చెందిన పరిమి సావిత్రి బృందం నిర్వహించిన శ్రీ కృష్ణ లీలా తరంగిణి గానామృత సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది. కిళాంబి పూర్ణ శ్రీ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. ట్రస్టుబోర్డు ఛైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు,దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసి రావు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

స్వామి వివేకానంద జీవితం ఆదర్శనీయం



విద్యార్థులకు బహుమతులు అందజేసిన హిందూ యువజన సంఘం ప్రతినిధులు

ఏలూరుచ (ఆర్‌ఆర్‌పేట): హిందూ సనాతన ధర్మాన్ని ప్రపంచానికి ఎలుగెత్తి చాటిన స్వామి వివేకానంద జీవితం భారతీయ యువతకు స్ఫూర్తివంతమైనదని హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు తెలిపారు. నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి కమిటీ ప్రతినిధులు పూలమాలవేసి స్మరించుకున్నారు. అనంతరం స్వామి వివేకానంద ప్రసంగాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వ కమిటీ సహాయ కార్యదర్శి కేటీ రావు, సంఘ గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్ లునాని, మేనేజ్మెంట్ కమిటీ సహాయ కార్యదర్శులు వేమా కోటేశ్వరరావు, సీహెచ్ సాయి తేజ, సభ్యులు ఎంవీవీఎస్ నాగేశ్వరరావు, శలా కోటి వీరయ్య, దువ్వి హేమ సుందర్, కొచ్చర్లకోట వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

వివేకానంద ఆశయాలకు అనుగుణంగా జీవించాలి

ఏలూరు (టూటౌన్): స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా నేటి తరం యువత జీవించాలని బీజేపీ సీనియర్ నాయకులు నాగం శివ పిలుపు నిచ్చారు. స్వామి వివేకానంద జయంతిని స్థానిక అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా అధ్యక్షుడు అదపాక నాగ సురేష్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు యర్రించి ముఖేష్, ప్రధాన కార్యదర్శి భాను ప్రకాష్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు శివ, మహేష్, గణపతి పాల్గొన్నారు.

ఉపాధి హామీలో 200 పని దినాలు కల్పించాలి



డీఆర్వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న బీకేఎంయూ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఉపాధి లేని గ్రామీణ పేదలు వలస పోకుండా జాబు కార్డులతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికీ 200 రోజులు పనిదినాలు ఉపాధి హామీ పథకం ద్వారా కల్పించాలని, రోజుకు కూలి రూ.600 ఇచ్చే విధంగా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా నాయకులు శుక్రవారం డీఆర్వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేసారు. గతేడాది వర్షాలు లేక చాలా జిల్లాల్లో పంటలు వేయలేదని, కొన్ని ప్రాంతాలు డిసెంబరు మొదటి వారంలో కురిసిన వర్షాల కారణంగా పంటలు కోల్పోయిన రైతులు, వ్యవసాయ కూలీలు పనులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బీకేయంయూ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఏలూరు జిల్లా అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచే వసంతరావు, జిల్లా ఉపాధ్యక్షుడు గొలిమే బాల యేసు, జిల్లా నాయకులు పొట్టేలు పెంటయ్య తదితరులు డీఆర్వోను కలిసి వినతిపత్రం అందజేసారు. దీనిపై డీఆర్వో మాట్లాడుతూ బీకేయంయూ ఇచ్చిన సమస్యలను కలెక్టర్, డ్వామా పీడీల దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

చేనేత, హస్తకళా ప్రదర్శనకు విశేష ఆదరణ



నగరంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనలో జన సందడి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శన నగర ప్రజలను విశేషంగా ఆకర్షిస్తోంది. గత నెల 13న నగరంలో ప్రారంభించిన ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులతో పాటు హస్తకళా కళాకారులు సైతం తమ ఉత్పత్తులను నగర ప్రజలకు అందుబాటులో ఉంచారు. విభిన్న ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ ప్రాంతాల్లోని సంప్రదాయ నేత పనితనంతో రూపొందించిన వెంకటగిరి, కళంకారి, చేనేత వస్త్రాలతో పాటు బెంగాలీ కాటన్, భాగల్పూర్ చీరలు, ఖాదీ వస్త్రాలు, జైపూర్ బెడ్‌షీట్లు ఆధునిక డిజైన్లతో అందుబాటులో ఉంచారు. సహరన్‌పూర్ కలప వస్తువులు, ఇమిటేషన్ ఆభరణాలు, వన్ గ్రాం గోల్డ్ ఆభరణాలు, కొండపల్లి కొయ్య బొమ్మలు ఉన్నాయి. ఈ ప్రదర్శన ఈ నెల 28వ తేదీ వరకూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకుడు ఎం. శ్రీనివాసరావు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఏలూరు నగర కొప్పుల వెలమ సంఘం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగర కొప్పుల వెలమ సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘం నాయకులు స్థానిక పవరుపేటలోని సంఘ భవనంలో శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. సంఘం నగర అధ్యక్షుడు భీమవరపు పాపారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అల్లు ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం పట్టణ కమిటీని, యువజన కమిటీలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి మరడాని అచ్యుతరావు, కోశాధికారి మూడెల్ల రంగారావు, మాజీ అధ్యక్షుడు బళ్ల శివ, యువత పట్టణ అధ్యక్షుడు సంపెంగ జగదీష్, నాయకులు నున్నా సత్యనారాయణ, లచ్చిరెడ్డి గోవిందు, పడాల వెంకటేశ్వరరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నూజివీడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): నూజివీడు ప్రాంతంలో పేదలు సాగు చేస్తున్న 10వేల ఎకాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే హక్కు పత్రాలను అందజేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని సీపీఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో సంఘం ఏలూరు జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లాలో నిరుపయోగంగా ఉన్న అడవి బంజరు ప్రభుత్వ రెవెన్యూ పోరంబోకు భూములను పేదలకు ఇవ్వాలని కోరారు. బీకేఎంయూ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కుంచే వసంతరావు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో వనసంరక్షణ సమితికి కేటాయించిన భూములను ఈఎస్ఎస్ సభ్యులకు వ్యక్తిగత పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బీకేఎంయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొలిమే బాల యేసు, పొట్టేలు పెంటయ్య పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ ఛైర్మన్ నేడు ఏలూరు రాక

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ఈ నెల 13న ఏలూరు రానున్నారు. శనివారం ఉదయం మచిలీపట్నం నుంచి బయలుదేరి ఉదయం 11 గంటలకు ఏలూరు జిల్లా రెవెన్యూ అతిథి గృహానికి ఆయన చేరుకుంటారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో పాల్గొననున్నారు. 11.30కు ఆయన ఏలూరు నుంచి బయలు దేరి రాజమహేంద్రవరం వెళతారు.